# ప్రజలంతా ముఖ్యమంత్రి కేసీఆర్ వెంటే..

● కలసికట్టుగా పనిచేసి సునీతాలక్ష్మారెడ్డిని గెలిపిద్దాం: జడ్పీటీసీ పబ్బ మహేశ్‌గుప్తా ● కాంగ్రెస్ నుంచి బీఆర్ఎస్‌లో చేరిన నాయకులు

శివ్వంపేట, నవంబర్2: ప్రజలంతా ముఖ్యమంత్రి కేసీఆర్ వెంటే ఉన్నారని, గ్రామాల్లో ప్రతిపక్ష పార్టీల కల్లబొల్లి మాటలను ప్రజలు నమ్మే పరిస్థితి లేదని జడ్పీటీసీ పబ్బ మహేశ్ గుప్తా పేర్కొన్నారు. రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఆకర్షితులై మండలంలోని తిమ్మాపూర్ మాజీ సర్పంచ్, కాంగ్రెస్ పార్టీ మండల సీనియర్ నాయకుడు వీరప్పగారి శంకర్ కాంగ్రెస్‌కు రాజీనామా చేసి గురువారం బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి వాకిటి సునీతాలక్ష్మారెడ్డి సమక్షంలో జడ్పీటీసీ పబ్బ మహేశ్ గుప్తా ఆధ్వర్యంలో గులాబీ గూటికి చేరుకున్నారు. ఈ సందర్భంగా జడ్పీటీసీ మహేశ్ మాట్లాడుతూ కేసీఆర్ ఆశీర్వదించి పంపిన బీఆర్ఎస్ అభ్యర్థి సునీతాలక్ష్మారెడ్డి విజయం కోసం ప్రతి ఒక్కరం పాటుపడాదామని, పార్టీలో ఎలాంటి అభిప్రాయబేధాలు లేకుండా కలసికట్టుగా పనిచేద్దామని సూచించారు. ప్రతీ కార్యకర్త సైనికుడిగా పనిచేసి నియోజకవర్గంలో బీఆర్ఎస్ విజయానికి కృషిచేయాలని ఆయన పిలుపునిచ్చారు. బీఆర్ఎస్ పార్టీలో చేరిన ప్రతి ఒక్కరికి సముచిత స్థానం కల్పిస్తామన్నారు. రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలకు సమన్యాయం చేస్తున్నది ఒక్క కేసీఆర్ ప్రభుత్వమేనని, ప్రజా అవసరాలను దృష్టిలో ఉంచుకొని ప్రజల మేలుకోసం సీఎం కేసీఆర్ మూడోసారి గెలిస్తే అమలుచేసే మ్యానిఫెస్టో పథకాలు ఎంతో ఆకర్షణీయంగా, అన్ని వర్గాల మేలుకు ఉపయోగకరంగా ఉన్నాయని పేర్కొన్నారు. మాజీ సర్పంచ్ శంకర్‌తో పాటు కాంగ్రెస్ సీనియర్ నాయకులు రాసుపల్లి భిక్షపతి, కొడకంచి ఆంజనేయులు గౌడ్, సీఎచ్ యాదయ్య, వై.రాములు, లక్ష్మణ్ యాదవ్, బుర్ర సాయి కుమార్‌గౌడ్, నరేశ్‌గౌడ్, భానుప్రసాద్, హరికృష్ణ, అనిల్, నితిన్, నాగరాజు, జనార్దన్, శ్రీకాంత్, వినయ్, కృష్ణ, శ్రీకాంత్, సందీప్, వినయ్, బాలకృష్ణ, మల్లేశ్, బాలు, సురేశ్ తదితరులు బీఆర్ఎస్ పార్టీ చేరారు. కార్యక్రమంలో చిన్నగొట్టిముక్కుల మాజీ ఎంపీటీసీ లక్ష్మయ్యగారి నర్సింగరావు, దర్శన్‌రావు, యమగోని ఆంజనేయులుగౌడ్, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.



కాంగ్రెస్ నాయకులను బీఆర్ఎస్ పార్టీలోకి ఆహ్వానిస్తున్న జడ్పీటీసీ మహేశ్ గుప్తా



బండపోతుగల్‌లో కాంగ్రెస్‌లో చేరిన వారిని తిరిగి బీఆర్ఎస్‌లోకి ఆహ్వానిస్తున్న నాయకులు

## అలా వెళ్లి.. ఇలా సొంతగూటికి

చిలిపిచెడ్, నవంబర్ 2: మండలంలోని బండపోతుగల్‌కు చెందిన పలువురు బీఆర్ఎస్ నాయకులు నర్సాపూర్‌లో కాంగ్రెస్ అభ్యర్థి ఆవుల రాజిరెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరి 24 గంటలు గడవకముందే తిరిగి బీఆర్ఎస్‌లోకి చేరారు. గురువారం సర్పంచ్ ఇస్తారి, గ్రామ బీఆర్ఎస్ అధ్యక్షుడు రాఘువరెడ్డి కాంగ్రెస్‌లో చేరిన కార్యకర్తలను బీఆర్ఎస్ కండువా కప్పి సొంతగూటికి చేర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా రైతు సమన్వయ సభ్యుడు సయ్యద్ హుస్సేన్, మండల కో ఆప్షన్ సభ్యుడు షఫీ పాల్గొన్నారు.

## నేడు కౌడిపల్లిలో బీఆర్ఎస్ ప్రచారం

కౌడిపల్లి, నవంబర్ 2: మండలంలోని వివిధ గ్రామాల్లో శుక్రవారం (నేడు) బీఆర్ఎస్ ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్నట్లు గురువారం బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు సార రామాగౌడ్ తెలిపారు. శుక్రవారం ఉదయం 8 గంటలకు ఎమ్మెల్యే మదన్‌రెడ్డి, పార్టీ అభ్యర్థి వాకిటి సునీతాలక్ష్మారెడ్డి తునికి నల్లపోచమ్మ దర్శనం చేసుకొని హరిచంద్‌తండా, తునికి దేవులతండా, ముత్రాజ్‌పల్లి, రాజిపేట్, వెంకటాపూర్, బాజితండా, కుషన్‌గడ్డతండా, తిమ్మాపూర్, రాయిలాపూర్, నాగ్‌సానిపల్లి, వెంకట్‌రావుపేట గ్రామాల్లో ఎన్నికల ప్రచారం పాల్గొంటారని ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ, జడ్పీటీసీ, సర్పంచులు, ఎంపీటీసీలు, వివిధ అనుబంధ సంస్థ డైరెక్టర్లు, గ్రామ పార్టీ అధ్యక్షులు, సోషల్ మీడియా కోఆర్డినేటర్లు పార్టీ శ్రేణులు పాల్గొని ప్రచారాన్ని విజయవంతం పిలుపునిచ్చారు.



నర్సాపూర్‌లోని ఆర్‌వో కార్యాలయాన్ని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ రమేశ్

## నామినేషన్ల ప్రక్రియ సజావుగా జరగాలి

● అదనపు కలెక్టర్ రమేశ్

నర్సాపూర్, నవంబర్2: సాధారణ ఎన్నికల నేపథ్యంలో నర్సాపూర్ పట్టణంలో ఏర్పాటు చేసిన ఆర్‌వో కార్యాలయాన్ని అదనపు కలెక్టర్ రమేశ్ గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ సజావుగా జరిగేలా చూడాలని అధికారులకు పలు సూచనలు, సలహాలను అందజేశారు. వీరితో పాటు రిటర్నింగ్ అధికారి శ్రీనివాసులు, తహసీల్దార్ కమలాద్రి, తూప్రాన్ డీఎస్పీ యాదగిరి రెడ్డి, సీఐ షేక్‌లాల్ మధార్, ఎస్సై శివకుమార్, ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.



జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాజర్షి షా, ఎస్పీ రోహిణితో సమావేశమైన పరిశీలకుడు సంజయ్‌కుమార్

## జిల్లాకు వ్యయ పరిశీలకుడు సంజయ్‌కుమార్ రాక

మెదక్, నవంబర్ 2 (నమస్తే తెలంగాణ): సాధారణ ఎన్నికలు 2023 నియమావళి అమలులో భాగంగా కేంద్ర ఎన్నికల సంఘం నియమించిన వ్యయ పరిశీలకుడు, ప్రత్యేక అధికారి సంజయ్‌కుమార్ ఐఆర్ఎస్ గురువారం జిల్లాకు చేరుకున్నారు. జిల్లా ఎన్నికల అధికారి/కలెక్టర్ రాజర్షి షా, జిల్లా ఎస్పీ రోహిణిప్రియదర్శిని కలిసి వ్యయ పరిశీలకుడికి జిల్లా అతిథి గృహంలో పుష్పగుచ్ఛంతో స్వాగతం పలికారు. ఆయన వెంట జిల్లా అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, జీఎం, జిల్లా పరిశ్రమల అధికారి కృష్ణమూర్తి, మెదక్ ఆర్ఓ/ఆర్డీవో అంబాదాస్ రాజేశ్వర్, తహసీల్దార్ శ్రీనివాస్, ఎన్నికల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



సంజయ్‌కుమార్‌కు స్వాగతం పలుకుతున్న కలెక్టర్ రాజర్షి షా



చేగుంట: పోతాన్‌పల్లిలో అక్రమ మద్యం స్వాధీనం చేసుకున్న రామాయంపేట ఎక్సైజ్ అధికారులు

## అక్రమ మద్యం స్వాధీనం

చేగుంట, నవంబర్2: అక్రమంగా మద్యం తరలిస్తున్న వ్యక్తి ద్విచక్ర వాహనంతో పాటు మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు రామాయంపేట ఎక్సైజ్ సీఐ జయసుధ తెలిపారు. ఎక్సైజ్ సీఐ కథనం ప్రకారం.. మాసాయిపేట రహదారిలో వాహనాలు తనిఖీ చేయగా, చేగుంట మండలం పోతాన్‌పల్లి గ్రామానికి చెందిన గోకని రవికిరణ్‌గౌడ్ ద్విచక్ర వాహనంపై అక్రమంగా మద్యం తరలిస్తుండగా పట్టుకుని నిందితుడిని అదుపులోకి తీసుకుని సుమారు రూ.15 వేలు విలువ చేసే మద్యం స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. తనిఖీల్లో ఎస్ఐ విజయ్ సిద్ధార్థ, సిబ్బంది దుర్గారెడ్డి, రాకేశ్, యాదగిరి, వెంకటేశం, శ్రీకాంత్, రజిత, వేణు ఉన్నారు.

## ప్రజాస్వామ్యంలో ఓటుకు ఎంతో విలువ

● జిల్లా విద్యాధికారి రాధాకిషన్ ● సూరారం జడ్పీ హైస్కూల్‌లో మాక్ పోలింగ్

చిన్నశంకరంపేట, నవంబర్2: ఎన్నికలలో ప్రతి ఓటరు తమ ఓటు హక్కును వినియోగించుకొని ప్రజాస్వామ్యంలో ఓటుకు ఉన్న విలువను చాటి చెప్పాలని జిల్లా విద్యాధికారి రాధాకిషన్ అన్నారు. గురువారం రోజున సూరారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎలక్టోల్ లిట్రసి క్లబ్ ప్రోగ్రాంలో భాగంగా విద్యార్థులతో మాక్ పోలింగ్ నిర్వహించారు. విద్యార్థులకు ఈవీఎంల పని తీరు, పోలింగ్ నిర్వహణ, బ్యాలెట్ కంపార్ట్‌మెంట్, ఓటర్ స్లిప్స్, తదితర అంశాలపై ఉపాధ్యాయులు విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం సూరారం ప్రధానోపాధ్యాయుడు చేగూరి సాయిరెడ్డి అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో విద్యాధికారి రాధాకిషన్ మాట్లాడుతూ ఎన్నికలలో ఓటు హక్కును వినియోగించుకోవడంలో కొద్ది మంది నిర్లక్ష్యం వహించడం మంచిది కాదని, ఓటు హక్కు అనేది సాధారణంగా కనిపించిన ప్రజాస్వామ్యంలో అత్యంత శక్తివంతమైన ఆయుధమన్నారు. కార్యక్రమంలో ఎలక్టోరల్ లిట్రసి క్లబ్ నోడల్ టీచర్ కే.రవి, ప్రాథమిక ప్రధానోపాధ్యాయులు శివప్రసాద్, విలేజ్ సెక్రటరీ నాంపల్లి, ఉపాధ్యాయులు వెంకయ్య, రమేశ్, మనీశ్‌రెడ్డి, జయశ్రీ, ఆసిఫ్, రూపేందర్, విద్యాసాగర్, కృష్ణమూర్తి, వినోద్‌కుమార్ పాల్గొన్నారు.



మాక్‌పోల్‌ను పరిశీలిస్తున్న డీఈవో రాధాకిషన్

## ఎన్‌డీవై కాలనీ నూతన కమిటీ ఎన్నిక

మెదక్ అర్బన్, నవంబర్2: మెదక్ పట్టణంలోని ఎన్‌డీవై కాలనీ (జమ్మికుంట) నూతన అధ్యక్షుడిగా గోకని వెంకటేశ్‌గౌడ్ ఎన్నికయ్యారు. గురువారం కాలనీ అభివృద్ధి కమిటీ సమావేశం నిర్వహించారు. పాత కమిటీ కాలవ్యవధి పూర్తి కావడంతో నూతన కమిటీని అధ్యక్షుడిగా గోకని వెకంటేశ్‌గౌడ్, గౌరవ అధ్యక్షుడిగా ప్రభాకర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా సంపత్, కార్యదర్శి రమేశ్, మురళీమోహన్, ఉపాధ్యక్షులుగా దొంతి నవీన్‌గౌడ్, రాజయ్య, సలహాదారులుగా గోపాల్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు వారు వెల్లడించారు.

## విద్యుత్ షాక్‌తో వ్యక్తి మృతి

నర్సాపూర్, నవంబర్ 2: విద్యుత్ షాక్‌తో ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన నర్సాపూర్ మున్సిపల్ పరిధిలోని హన్మంతాపూర్‌లో గురువారం జరిగింది. గ్రామస్తులు కథనం ప్రకారం.. హన్మంతాపూర్ గ్రామానికి చెందిన గొల్ల కృష్ణ (50) వ్యవసాయం చేస్తూ జీవనం గడుపుతున్నాడు. గురువారం పొలం చూడటానికి వెళ్లి.. తెగిపడ్డ విద్యుత్ వైర్ కృష్ణ కాలికి తగలడంతో అక్కడికక్కడే మృతి చెందాడు.



ఓటు హక్కుపై అవగాహన కల్పిస్తున్న కళాబృందం

## రండి అందరం ఓటేద్దాం..

చిన్నశంకరంపేట, నవంబర్2: మండలంలోని గవ్వలపల్లిలో గురువారం ఓటు హక్కుపై కళా ప్రదర్శన నిర్వహించారు. ఓటు హక్కు ప్రజాస్వామ్యం ఓ ఆయుధం లాంటిదని, 'రండి అందరం ఓటేద్దాం.. మన మెతుకు సీమ గెలిపిద్దాం' అంటూ కళా ప్రదర్శన ద్వారా ఓటర్లకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సీడీపీవో స్వరూప, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శివకుమారి, మధుకర్, ఆంజనేయులు, పంచాయతీ కార్యదర్శి సాయికుమార్, కళాబృందం సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.